# 10

# సినిక్

తెలిసే అన్నాడో తెలియకే అన్నాడో మా నాయుడు నన్ను ఒకమాట అన్నాడు. అది నా గుండెల్లో గాలంలా గుచ్చుకొని ప్రాణం విలవిల్లాడిపోయింది. నాది మరీ సుకుమార హృదయమనీ, మాటపడని వాణ్ణని చెప్పడం నా వుద్దేశం కాదు. మరి ఎందుకు బాధపడ్డట్టు అంటే సంఘటనకు పూర్వాపరాలు చెప్పాలి. కొంచెం విపులంగానే చెప్పాలి.

ఆరోజు ఉదయం నాయుడుకోసం ఎదురుచూస్తూ కూచున్నాను. నాయుడు వస్తే ఇద్దరం కలిసి డాక్టరు వాసుదేవశాస్త్రి గారిని కలుసుకోవాలి! వారం రోజులలో జరగబోయే రచయితల సభకి ఆయన్ని ఉపన్యాసకుడుగా ఒప్పించాలి. ఈ కార్యక్రమం మీద ఉదయం ఏడింటికే మా యింటి దగ్గరికి వస్తానన్నాడు నాయుడు. తొమ్మిదిదాటినా అజాపజాలేదు. అతనిది అనితర సాధ్యమైన అరాచకత్వం. ఈ రోజంతా కూడా వస్తాడోరాడోనన్నది నాకు అనుమానమే. అట్లాంటి మనిషికోసం ఎదురుచూస్తూ కూచోడమంటే మహాదుర్భరంగా వుంటుంది. నాయుడు రాకపోతేనేం నేనే వెళ్ళి శాస్త్రి గారిని కలుసుకోకూడదా అనిపించింది. కానీ వచ్చిన చిక్కేమిటంటే నేను ఈ వూరికి కొత్త. శాస్త్రిగారిని అసలు ఎరుగను నేను. శాస్త్రిగారితో బాగా పరిచయమున్న వాడు నాయుడే. శాస్త్రిగారి పేరు సూచించింది కూడా నాయుడే.

"శాస్త్రిగారు మంచి వక్తా, సహృదయుడు. ఉపన్యాసకుల జాబితాలో ఆయన పేరు చేర్చాలి" అన్నాడు నాయుడు కార్యవర్గ సమావేశంలో.

"వక్త అన్నది ప్రధానాంశం కాదు ఇక్కడ. మన ఆశయాలతో ఏకీభవించే వాడేనా?" అన్నాను..

"ఏకీభవించకపోవడమేమిటి? గొప్ప అభ్యుదయ భావాలున్న వ్యక్తి. మునుపు మన సమావేశాలలో ఒకటి రెండుసార్లు మాట్లాడాడు కూడాను" అన్నాడు నాయుడు.

దాంతో నాయుడు ప్రపోజల్ని కాదనడానికి తగినంత కారణం కనిపించలేదు. మద్రాసు నుంచి, హైదరాబాదు నుంచి నలుగురైదుగురు కాస్త స్టేటస్ వున్నవాళ్ళు ఉపన్యాసకులుగా వస్తున్నారు. మిగతావాళ్ళని 'నిలయ విద్వాంసు'ల్నించి ఎన్నుకోవాలి. వారిలో శాస్త్రిగారిని ఎన్నుకోవడం మంచిదేననిపించింది, కానీ సభలు చాలా దగ్గరిలో వున్నాయి. ఇంకా శాస్త్రిగారిని కలుసుకోలేదు. నాయుడేమో యిలా తాత్సారం చేస్తున్నాడు. నాకు మహా చిరాగ్గావుంది. ఏం తోచక క్రితం రోజున పేపరే మళ్ళీ ముందేసుకొని కూర్చున్నాను.

'నాన్నా' అంది మా అమ్మాయి అజిత వచ్చి.

'ఏమ్మా' అన్నాను కళ్ళకడ్డంగావున్న పేపరు తియ్యకుండానే.

'ఈరోజు క్లాసులో కాంపోజిషన్ రాయాలి' అంది.

'మంచిది. రాయమ్మా' అన్నాను.

"రాస్తాను. ఏం రాయాలో చెబితే!" అంటూ నసిగింది.

అది ఆరో క్లాసు చదువుతోంది పాఠం చెప్పమని యేనాడూ నన్ను అడగలేదు, ఆ మాటకొస్తే పిల్లల విషయంలో తగిన శ్రద్ధ నేనే తీసుకోలేకపోయాను. సవాలక్ష వ్యాపకాలు నెత్తినేసికొని తిరుగుతూ పిల్లల్ని గాలికి వదిలాను, నాకు చప్పున యిది అంతర్జాతీయ బాలల సంవత్సరం అన్న విషయం స్ఫురించింది, ఇప్పటినుంచైనా పిల్లల విషయంలో కాస్త శ్రద్ధచూపాలి, నాయుడు ఈ రోజు ఎలాగూ వచ్చే సూచనలేదు గనుక - నాందిగా ఈరోజే ఆ పిల్లకు కాసేపు పాఠం చెబుదామన్న వుద్దేశ్యంతో, దగ్గరికి తీసికొని,

'దేన్ని గురించి చెప్పమంటావమ్మా' అన్నాను.

'ఈగను గురించి కాంపోజిషన్ రాయాలి నాన్నా' అంది.

'ఆవో, కుక్కోగాక ఈగేమిటమ్మా' అన్నాను.

'మరి టీచరేమో ఈగను గురించే రాయమంది' అంది.

యేం చెప్పడమా అన్న ఆలోచనలో పడ్డాను, పిల్లలకి బోధించడమన్నది కవిత్వం రాయడంకన్నా కష్టమైనపని, నాకు కృత్యాద్యవస్థ ప్రారంభమైంది, ఇంతలోనే నాయుడు సుడిగాలిలా వచ్చాడు.

'ఇంకా యేమిటలా కూర్చొని కునికిపాట్లు పడుతున్నావ్? లేలే వెళదాం త్వరగా' అన్నాడు.

'అఫెన్స్ ఈజ్ ది బెస్ట్ ఫార్మ్ ఆఫ్ డిఫెన్స్' అన్నది నాయుడు ధియరీ, నాయుడు చేసిన ఆలస్యం గురించి మాటాడకుండా దాడి ప్రారంభించాడు. అతనితో తగవు పెట్టుకొని లాభంలేదు. నోరున్న వాడిదే రాజ్యం.

'అజిత పాఠం చెప్పమంటోంది, నువ్వొక్కడివే వెళితేసరిపోదా!' అన్నాను.

'నీ వ్యవహారమంతా వొల్లని మొగునికి తలంబ్రాలు పోసినట్లుగా వుంది? మాటాడక లే' అంటూ అబ్బ పట్టుకున్నాడు.

పాపం! అజిత దిగులుగా నావేపు చూస్తుంది. 'పది నిమిషాలలో వస్తానమ్మా, అందాకా యేదన్నా చదువుకుంటూ కూర్చో' అని దానికి నచ్చచెప్పి బయటికి వచ్చాడు.

'రిక్షాలో వెళదామా' అన్నాను నాయుడితో.

'ఎందుకూ చాల దగ్గిరే, కొంచెం దూరం వెళ్ళామంటే అవధూత మంటపం, దాంతర్వాత గరల్స్ హైస్కూల్. అక్కడే శాస్త్రిగారిల్లు, మాటాడుకుంటూ వెళదాం పద' అన్నాడు.

'అవధూత మంటపమేమిటి?' అన్నాను.

మామూలు కథే! పాపం ఈ దేశంలో ప్రజలకి చెయ్యడానికి చేతినిండా పని వుండదు. అస్తమానం గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోలేరుకదా? యేదో ఒకపని చెయ్యాలి పిచ్చివాళ్ళనీ, కమ్ భిక్షగాళ్లనీ పట్టుకుని అవధూతల్ని చేసిపారేస్తారు. ఛస్తే వాళ్ళకి మంటపాలు కట్టిస్తారు. వాళ్ళ మహాత్మ్యాలని జీతభత్యాలు లేకుండానే యింటింటికీ వెళ్ళి ప్రచారం చేస్తారు. ఈ అవధూతల మహాత్మ్యాలు చిత్రవిచిత్రంగా వుంటాయి. నైట్‌డ్యూటీ మీదున్న ఐస్.ఐ. ఒకాయన ఈ అవధూతని వెంబడించాడట. అవధూత మునిసిపల్ హైస్కూల్ గ్రౌండ్‌దాకా వెళ్లి అక్కడ పడుకున్నాడు. కాసేపట్లో అవధూత తలా కాళ్లూ, చేతులూ యే అవయవానికి ఆ అవయవం విడిపోయాయి, పోలీసు డిపార్టుమెంటులోని ఆ పుణ్యపురుషునికి అవధూత అలా సాక్షాత్కరించాడు. మరో బట్టల కొట్టాయన్ని అవధూత స్పృశించాడు. అంతే. అమాంతం ఆయన లక్షాధికారి అయిపొయ్యాడు. ఇలాంటి ఉదంతాలు చాలానే ఉన్నాయి.

"పోయిన సంవత్సరం అవధూత చనిపోయాడు. అవధూత అంతిమయాత్రలో యిరవైవేలమంది పాల్గొన్నారు" అన్నాడు నాయుడు.

నాయుడు చెబితే జ్ఞాపకం వచ్చింది. అవధూత అంతిమ యాత్రని గురించి తెలుగు దినపత్రికలు ఘనంగా రాశాయి. నేనూ చదివాను.

"ప్రజలు బాబాల, అవధూతల ఏలుబడిలో వున్నారు. మన దుర్భ్రమగాని వీళ్ళని చైతన్యవంతుల్ని చెయ్యడం ఎవరితరం?" అన్నాను.

"ఇదే శాస్త్రిగారిల్లు" అన్నాడు నాయుడు. ఒక ఇంటిముందు ఆగి.

శాస్త్రిగారు యింట్లోనే వున్నారు. మమ్మల్ని సాదరంగా ఆహ్వానించి కాఫీ ఇచ్చారు. పరిచయాలూ అవీ అయ్యాక, "ఏమిటి పొద్దున్నే ఇలా వచ్చారు?" అన్నాడు శాస్త్రిగారు.

నాయుడు వచ్చిన పని చెప్పాడు.

"బాగుంది. దీనికి మళ్ళీ నా అనుమతి కావాలి? నేనుకూడా మీలో ఒకణ్ని" అంటూ నావైపు తిరిగి, "మీరు క్రొత్త. నా విషయం నాయుడికి తెలుసు" అన్నాడు.

నాకు సంతోషమయింది. శాస్త్రిగారితో కాసేపు హస్కుకొట్టి నాయుడూ నేనూ మళ్ళీ మా యింటి దగ్గరికి వచ్చాము.

మా చిట్టితల్లి కసబియాంకా లాటిది. అలాగే చదువుకుంటూ కూచొనివుంది.

"పది నిముషాలన్నావు. గంటయింది నాన్నా'' అంది మా అమ్మాయి నిష్టూరంగా.

"కొంచెం ఆలస్యమే అయింది. పేపరు వచ్చినట్లుందే. కాస్త హెడ్‌లైన్స్ చూచి నీ ఈగను గురించి చెబుతానమ్మా'' అన్నాను నవ్వుతూ.

పేపర్‌బోయ్ పేపరుతోబాటూ ఏదో కరపత్రం కూడా వేసివెళ్ళాడు కరపత్రం చేతికి తీసుకున్నాడు.

అది అవధూత స్మారకసభ కరపత్రం. ఉపన్యాసకుల్లో శాస్త్రిగారి పేరుకూడా వుంది. నిజంగానే నా మనసు వికలమై పోయింది. దిగ్భ్రమ కలిగింది.

"ఏమిటా కరపత్రం'' అన్నాడు నాయుడు.

"ఈగ శుద్ధాన్నీ అశుద్ధాన్నీ ఒకలాగ భుజిస్తుంది, మనుషుల్లో కూడా ఈగల్లాంటి వాళ్లుంటారని నాకు యిప్పుడే తెలుస్తూంది'' అంటూ కరపత్రం నాయుడి చేతికిచ్చాను.

శాస్త్రిగారిమీద ఈగ వాలితే కూడా నాయుడు సహించేట్టు లేడు. ఈగతో పోల్చానని ఎంత బాధకలిగిందో ఏమో.

"నువ్వొట్టి సినిక్''వి అన్నాడు.

అదో అదీ నాయుడు నన్నన్నమాట. అదే నాకు బాధ కలిగింది.

- (ఏప్రిల్ 1979 ప్రభవ మాసపత్రిక)

కథా నిలయం
5181
శ్రీకాకుళం